క్లుప్తంగా

బీమాచెక్కు అందజేత

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ పురుషుల పొదుపు సంఘంలో సభ్యుడిగా కొనసాగిన గొల్లపెల్లి చంద్రమౌళి ఇటీవల మృతిచెందాడు. పురుషుల పొదుపు సమితి నుంచి మంజూరైన రూ.78134 బీమా చెక్కును సమితి అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ ఆదివారం చంద్రమౌళి కుటుంబానికి అందజేశారు. మృతుని భార్య భారతవ్వ, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న బస్వయ్య

శంకరపట్నం: మండల కేంద్రం కేశవపట్నం టౌన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మీర్జా ఆరిఫ్‌బేగ్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు బస్వయ్య తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నియామకపత్రం అందించారు.

సన్మానం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్ రావును ఆదివారం డెయిరీ ఉద్యోగులు సన్మానించారు. వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ నుంచి చైర్మన్ డాక్టరేట్ అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని డెయిరీ ఆవరణలో సన్మానోత్సవం నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు డెయిరీ రంగంలో పనిచేస్తూ వందలాదిమంది ఉద్యోగులకు పని కల్పిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. కార్యక్రమంలో డెయిరీ సీఈవో కృష్ణ ప్రసాద్, ఏజీఎంలు ఆకునూరి సుధాకర్, వెంకటస్వామి, మేనేజర్లు సంతోష్ కుమార్, రజినీకాంత్‌రెడ్డి, డెయిరీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా రామడుగు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో నాలుగు క్వింటాళ్ల యాభై కిలోల బియ్యం తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేందర్ తెలిపారు.

నూతన కార్యవర్గం



నియామకపత్రం అందజేస్తున్న ఆల్ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు

గన్నేరువరం: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గన్నేరువరం నూతన కార్యవర్గ ఏర్పాటుకు ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల మహేందర్ అధ్వర్యంలో మండల కేంద్రంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి సాంబారి కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పారునంది జలపతి హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కవ్వంపల్లి రాజయ్య, మండల అధ్యక్షుడిగా వెదిరె విజేందర్, ఉపాధ్యక్షుడిగా కల్లెపల్లి కొమురయ్య, పురుషోత్తం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా న్యాత శ్రీనివాస్, కోశాధికారులుగా బామండ్ల శంకర్, అమ్మిగల్ల సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా మానువాడ జోసి, జంగిటి పోశయ్య, ప్రచార కార్యదర్శిగా గువ్వల లక్ష్మణ్, కార్యవర్గసభ్యులుగా వెదిరె రాజ్‌కుమార్, అమ్మిగల్ల సుధాకర్, బామండ్ల కృష్ణకుమార్, బామండ్ల రవీందర్, దమ్మిగల్ల అనిల్ నియామకమయ్యారు.

పరామర్శ

జమ్మికుంట: పట్టణంలోని పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆదివారం పరామర్శించారు. వెంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాచపల్లి రమేశ్, సీనియర్ నాయకుడు పొనగంటి రవీందర్, పట్టణ మాజీ ఉపాధ్యక్షుడు బుర్రకుమార్‌గౌడ్, తిరుపతి, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన చౌరస్తాల్లో జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ స్థాపించి ముప్పై ఏళ్లు పూర్తవుతున్నాయని, దేశంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఏకైక కుల సంఘమని పలువురు పేర్కొన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

మూలమలుపులు మృత్యులోగిళ్లు

- రక్షణ చర్యలు కరువు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



హుజూరాబాద్ నుంచి కనుకులగిద్దె గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా మూలమలుపు

హుజూరాబాద్‌రూరల్: సమాజంలో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తులు తిరిగి క్షేమంగా వస్తారనే నమ్మకం ప్రస్తుతం సన్నగిల్లుతోంది. ఆయా గ్రామాలకు వెళ్లే అంతర్గత రహదారుల మధ్యలో ఉన్న మూలమలుపులు వాహనదారుల పాలిట యమగండంగా మారుతున్నాయి. హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లోని ఆయా గ్రామాల్లో అత్యంత ప్రమాదకరంగా మూల మలుపులు ఉండటంతో వాహనదారులు ప్రాణాలను అరచేతి లో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మలుపుల వద్ద పొంచి ఉన్న ప్రమాదం...

మండలంలోని గ్రామ పంచాయతీల్లోని ఆయా గ్రామాలకు వెళ్లే దారిలో గల మూల మలుపులుగా ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధానంగా హుజూరాబాద్ టూ కనుకులగిద్దె గ్రామం నుంచి ధర్మరాజుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో, సిర్సపల్లి నుంచి వెంకట్రావ్‌పల్లె గ్రామానికి వెళ్లే దారిలో, రంగాపూర్ టూ జూపాక గ్రామానికి వెళ్లే దారిలో, పెద్దపాపయ్యపల్లి నుంచి చిన్నపాపయ్యపల్లి గ్రామం మధ్యలో, ఇప్పలనర్సింగాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో, కాట్రపల్లి గ్రామానికి వెళ్లే దారిలో, కేసీ క్యాంపు నుంచి దమ్మక్కపేటకు వెళ్లే దారుల్లో సుమారు వందకుపైగా ప్రమాదకరమైన మూల మలుపులు ఉన్నాయి.



రంగాపూర్ నుంచి జూపాక వెళ్లే దారిలో ప్రమాదకరంగా మూలమలుపు

రక్షణ చర్యలు కరువు

అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరిగి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. మూల మలుపులను ఆనుకొని చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. దీనికి తోడు మరికొన్ని చోట్ల మూల మలుపులు ఉన్న ప్రాంతంలో రహదారికి ఆనుకొని వ్యవసాయ బావులున్నాయి. అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం పెద్ద ఎత్తున జరిగే ఆస్కారం ఉంది. ప్రమాదకర మూల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలను నిర్మించడం గాని చేయడంలేదు. ఆయా గ్రామాలకు వెళ్లే అంతర్గత రహదారులన్ని సింగిల్ రోడ్లుగా ఉండటంతో మూల మలుపుల వద్ద పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాలబారిన వాహనదారులు

మూల మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు లేకపోవడంతో పెద్ద ప్రమాదాలు సంఖ్యలో జరుగుతున్నాయి. ఇటీవల సిర్సపల్లి గ్రామంలోని శివాలయం వద్ద ప్రమాదకర మూల మలుపు మూలంగా ఓ నిండు ప్రాణం బలికాగా.. మరో యువకుడు ప్రాణాలతో కొట్టు మిట్టాడుతున్నాడు. మూల మలుపుల వద్ద తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ తీవ్ర గాయాలపాలవుతున్నారు. దీంతో క్షతగాత్రుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

'డబుల్' ఇళ్లు పంపిణీ చేయాలి

జమ్మికుంట: గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పథకం ప్రవేశపెట్టినప్పటికీ పేదవారికి పూర్తిస్థాయిలో అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు పట్టణ పరిసర ప్రాంతాల్లో కిరాయిలకు ఉంటూ జీవనం గడుపుతున్నారని, నిర్మించిన ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్నాయని ఆరోపించారు. రూ.వందల కోట్లతో నిర్మించిన ఇళ్లను వృథా చేయకుండా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చొప్పదండి: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిలా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేశారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, తైక్వాండో అసోషియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుర్రం ఆనందరెడ్డి, అధ్యక్షుడు దొంతుల మనోహర్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ బాలబాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, శారీరక, మానసికంగా దృఢంగా ఉంటారని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందవచ్చన్నారు. 19 నుంచి 21 వరకు బెల్లంపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారులను పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీగాధ సంతోశ్, పెద్దపల్లి తైక్వాండో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్, కోచ్‌లు రాజేందర్, కిరణ్‌కుమార్, నాగమణి, అంజలి, రమ్య, గణేశ్ పాల్గొన్నారు.

హోంశాఖ సహాయ మంత్రికి వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రమిస్తున్న కరుణాకర్

హుజూరాబాద్‌రూరల్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ ఆదివారం జిల్లా కేంద్రంలో వినతిపత్రం సమర్పించారు. వరంగల్ – జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా మానకొండూరు, శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి మండలాల్లోని ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ భూములకు వెళ్లే దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వ్యవసాయక్షేత్రాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, హైవే పక్కనే సర్వీసు రోడ్డును నిర్మించాలని కోరారు. ఈమేరకు హైవే అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. అలాగే రైతుభరోసా నిధుల గూర్చి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరగా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వెంట స్టేట్ కౌన్సిల్ పుప్పాల రఘు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలి

గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని బ్రిడ్జి జేఏసీ అధ్యక్షుడు సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. మండలకేంద్రంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు విశ్రమించమని, మండలం నుంచి కరీంనగర్‌కు 9 కిలోమీటర్ల దూరం ఉండేదని, మానేరు డ్యాం నిర్మాణం అనంతరం 40 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. మండలానికి సరియైన రోడ్డు మార్గం లేక మండలం వెనుకంజలో ఉందని, విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, సకాలంలో వైద్య సేవలు అందక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. బ్రిడ్జి సాధన కమిటీ 2013లో ఏర్పాటు చేశామని, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలు అభివృద్ధిలోకి రావాలంటే బ్రిడ్జి నిర్మాణం ఎంతో అత్యవసరమన్నారు. వెంటనే సర్వే చేయించి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంట: పట్టణంలోని గౌతమ స్కూల్ 2008–09 పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, మహమ్మద్ అంకూస్, గుండ్ల రమేశ్, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కోమల్‌రెడ్డి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో వీర్ల వెంకటేశ్వర్‌రావు



రామడుగు: రామడుగు మండల సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డితో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రామడుగు మండలం వెలిచాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు జన్మదినం పురస్కరించుకొని వెలిచాల గ్రామస్తులు ఆదివారం గ్రామ పరిధిలోని ప్రశాంత్‌భవన్‌లో చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యులు సంజీవరావు, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



శంకరపట్నం: కన్నాపూర్‌లో పోచమ్మ బోనాలతో మహిళలు



చిగురుమామిడి: లంబాడిపల్లిలో పోచమ్మతల్లి ఆలయం వద్ద బోనాలు

మానకొండూర్: మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం అధ్వర్యంలో ఆషాఢమాసం పురస్కరించుకొని ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు.

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం అధ్వర్యంలో పోచమ్మ బోనాల జాతర నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. పిల్లాపాపలతో కుటుంబాలను సల్లంగా చూడుతల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రెడ్డి సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు మోరపల్లి సంపత్‌రెడ్డి, హనుమండ్ల కనకారెడ్డి, అనంతరెడ్డి, పింగిలి సంపత్‌రెడ్డి, కాటం శ్రీనివాస్ రెడ్డి, జంగా రమణారెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజిరెడ్డి, కర్ర అశోక్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ధర్మారం, కన్నాపూర్ గ్రామాల్లో పోచమ్మ బోనాలు నిర్వహించారు. పిల్లాపాపలను చల్లంగా చూడాలని, పాడి పంటలు పండాలని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని శ్రీహోమ్స్ కాలనీ అధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో బత్తుల అపర్ణ, మేడి మంగ, అనిత, శ్రీలత, శారద, స్వరూప, లక్ష్మణ్ రాజయ్య, శ్రీనివాస్, అనిల్, రాకేశ్, నర్సింహారెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు



తిమ్మాపూర్: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రోడ్లను కమ్మేస్తున్న చెట్ల పొదలు



సుందరగిరి–బొమ్మనపల్లి–హుజూరాబాద్ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపైకి వస్తున్న చెట్ల కొమ్మలు

చిగురుమామిడి: మండలంలోని దాదాపు అన్ని ప్రధాన రహదారులను చెట్లు, ముళ్లపొదలు, పనికిరాని పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారాయని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హుస్నాబాద్–కరీంనగర్ ప్రధాన రహదారి పొడవునా, సుందరగిరి–బొమ్మనపల్లి–దుద్దెనపల్లి రహదారి పొడవునా, హుస్నాబాద్ మండలం రాములపల్లి–బొమ్మనపల్లి–రేకొండ–మొగిలిపాలెం గ్రామాల నుంచి మానకొండూర్ వెళ్లే ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ప్రధాన రహదారుల పొడవునా బీటీ రోడ్ల వెంట చెట్లు, ఇతర పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. రహదారిని రెండు మీటర్ల వరకు ఆక్రమించడంతో.. వాహన రాకపోకలకు తిప్పలు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వాహనదారులు వాపోతున్నారు. సంవత్సరకాలంగా ఈ రహదారులను పట్టించుకున్న అధికారులే లేరని పలువురు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు పక్కనున్న ఖాళీ స్థలాన్ని కూడా చెట్లు, ముళ్లపొదలు ఆక్రమించాయి. ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానకొండూర్ డివిజన్ ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. బీటీ రోడ్డుకు రెండువైపులున్న చెట్లు, ముళ్లపొదలను తొలగించడంతోపాటు సైడ్‌బర్మ్ పనులు చేపట్టేందుకు తగిన ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

గుంతలమయంగా రోడ్డు



మానకొండూర్: చెంజర్ల నుంచి పెద్దూర్‌పల్లెకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల అడపదడపా కురుస్తున్న వర్షాలకు తారు లేచిపోయి గుంతలమయంగా మారింది. ఈ రహదారి గుండా మన్నెంపల్లి, పొరండ్ల, చెంజర్లకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై తారు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా భారీ వృక్షం



రామడుగు: గోపాల్‌రావుపేటలో నిత్యం కూరగాయల మార్కెట్ నిర్వహించే రహదారిలో భారీ వృక్షం ప్రమాదకరంగా మారింది. దీని కింద కూర్చొని వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తారు. నిత్యం కూరగాయలు కొనుగోలుకు ప్రజలు వస్తూపోతుంటారు. దీని కొమ్మలు పూర్తిగా ఎండిపోయి ఏ కొమ్మ ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

రహదారిపై గుంత



రామడుగు: రామడుగు నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే ప్రధాన రహదారిపై గ్రావిటీ కాలువ వద్ద భారీ గుంతతో వాహనదారులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. గ్రావిటీ కాలువ నిర్మాణం చేసిన సమయంలో అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయడంతో.. దాన్ని ఆనుకొని బీటీ రోడ్డు వేశారు. కాగా బీటీ పూర్తిగా పాడైపోవడంతో భారీగా గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు నానా తంటాలు పడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.